
సాక్షి ఒడిశా

మంగళవారం | 30 | ఏప్రిల్ | 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,13,164లు వచ్చాయని అధికారులు తెలిపారు.



రూ.3.50 లక్షలు స్వాధీనం

రాష్ట్రంలో ఎన్నికల పర్వం ఆరంభం కావడంతో నగదు, ఉచితాల అక్రమ తరలింపు, రవాణా పట్ల తనిఖీ వర్గాలు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నాయి.

- 8లో



జయపురంలో బీజేడీకి షాక్

జయపురం పట్టణ బీజేడీ ఉపాధ్యక్షురాలు తృప్తి పట్నాయక్ వందలాది మంది మహిళా సహచరులతో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

- 8లో

న్యూస్‌రీల్

విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి



మృతి చెందిన తిరుపతి పట్నాయక్

రాయగడ: విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందిన ఘటన కలహండి జిల్లా లంజిఘడ సమితి మాలికుబంగొ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుడు రాయగడ జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో జగన్నాథ్ కాలనీలో నివాసముంటున్న తిరుపతి పట్నాయక్‌గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. తిరుపతి గత కొన్నేళ్లుగా సోలార్ విద్యుత్‌తో నిడిచే గొట్టపుబావుల పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం కలహండిలోని మాలికుంబంగొ గ్రామానికి వెళ్లి గొట్టపుబావుల పని చేస్తుండగా, ఒక ఇనుప పైప్ ఎత్తే క్రమంలో పైనుంచి వెళ్లే 11 కేవీ విద్యుత్ వైర్‌కు పైప్ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కలహండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎంపీ సప్తగిరి ఉలక

రాయగడ: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పార్టీలను వీడి వేరే పార్టీలో చేరుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. బీజేడీ పార్టీలోని కొందరు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక స్వగృహంలో ఈ మేరకు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాయగడ సమితిలోని పూర్ణచంద్ర సామల్, జోయర్ బచేలి, పి.మండంగి, రఘుమణి సరక, భారతీ తాడింగి, పాతి ఉర్లాక, జిందా పువ్వల, బలరాంమండంగి, కేశవ్ సిరిక, మోహన్ కొరకొర, కరుణాకర్ కొంటొబొంసి వంటి బీజేడీ సీనియర్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి సప్తగిరి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీ సాధారణ కార్యదర్శి శంకర్షన్ మంగరాజ్, సర్పంచ్ అశోక్ పువ్వల, శంకర్ జిలకర తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు నిందితుడు అరెస్టు



చోరీ కేసులో అరెస్టైన రాజ్ కిషోర్

రాయగడ: జిల్లాలోని అంబొదల పోలీసులు ఒక చోరీ కేసుకు సంబంధించి పాడిమస్క గ్రామానికి చెందిన రాజ్ కిషోర్ మాఝి అనే యువకుడిని అరెస్టు చేసి, అతని నుంచి దొంగతనానికి గురైన 45.48 గ్రాముల బంగారు నెక్లెస్, మరో అర తులం బంగారు ఉంగరం, మెల్ట్ చేసిన 12.47 గ్రాముల బంగారంతో పాటు మరో రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకుని కోర్టుకు సోమవారం తరలించారు. కేసుకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం ఈనెల 22వ తేదిన అంబొదల పోలీసుస్టేషన్ పరిధి పాడిమస్కా గ్రామంలో నివసిస్తున్న కేశవ అంబాడి అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడు రాజ్ కిషోర్ మాఝి బాధితుడికి అత్యంత సన్నిహితుడు కాగా, తరచూ అతని ఇంటికి వెళ్తుంటాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిందితుడు చోరీకి పాల్పడ్డాడు.

ట్రక్కుబోల్తా–డ్రైవర్ దుర్మరణం

- క్లీనర్ సహా ఆరుగురికి గాయాలు
- కల్లికోట్ ఘాట్‌పై ప్రమాదం



బోల్తాపడిన ట్రక్కు

బరంపురం: భారీ ట్రక్కు అదుపుతప్పి గోతులో బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందగా.. క్లీనర్ సహా ఆరుగురు గాయపడ్డారు. గంజాం జిల్లా కల్లికోట్ ఘాట్‌పై సోమవారం వేకువజాము నాలుగు గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బోల్తా పడిన వాహనం తెలంగాణ నుంచి ఖుర్దా వెళ్తుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, కల్లికోట్ పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వాహనంలో చిక్కుకున్న డ్రైవర్ మృతదేహాన్ని వెలికి బయటకు తీశారు. అలాగే క్షతగాత్రులను ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. ఖుర్దా జిల్లా జట్నీ ప్రాంతానికి చెందిన డ్రైవర్ రమన్‌నాథ్ సాహు అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. క్రేన్ సహాయంతో బోలాపడిన ట్రక్కును బయటకు తీశారు. ఈ ఘోర ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్ర భానుడు..!



కళాశాలలకు గొడుగులు వేసుకొని వెళ్తున్న విద్యార్థినులు



కర్ఫ్యూని తలపిస్తున్న కొమ్మపల్లి రోడ్డు

- రాష్ట్రంలో భయపెడుతున్న ఉష్ణోగ్రతలు
- భయటకు వచ్చేందుకు భయపడుతున్న ప్రజలు
- కర్ఫ్యూని తలపిస్తున్న రోడ్లు

బరంపురం:

రాష్ట్రంలో రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. గత రెండు రోజులుగా భానుడు భగభగమంటున్నాడు. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీస్తున్న వేడిగాలులు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు బయపడుతున్నారు. అత్యవసర పనులు ఉంటేగానీ బయటకు రావడం లేదు. కొంతమంది ఎండ తగలకుండా అనేక జాగ్రత్తలు పాటిస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. చిల్లర వ్యాపారులు ఎండ వేడికి తట్టుకోలేక దుకాణాలను సాయంత్రం 4 గంటలు అయితేగానీ తీయడం లేదు. ఎండ నుంచి సేద తీరడానికి శీతల పానీయాలు, కర్భూజ పండ్లపై ఆసక్తి చూపుతున్నారు. పగలు ఎండ, రాత్రి ఉక్కపోతకు అప్రకటిత కరెంట్ కోతలు తోడవడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇంకా రానున్న రోజులను తలచుకొని భయాందోళన చెందుతున్నారు.

బయట తిరగొద్దు

వడదెబ్బ నివారణకు వీలైనంత వరకు ఎండలో తిరగవద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయట వెళ్లకపోవడం మంచిదంటున్నారు. ఉద్యోగులు, కూలీ పనులు చేసుకునేవారు తల, ముఖానికి వేడిగాలులు తగలకుండా జాగత్తలు తీసుకోవడంతో పాటు మంచినీరు, తేలికగా జీర్ణమయ్యేవి ఆహారంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. అధిక వేడికి మనిషి శరీరంలోని ఉష్ణోగ్రత నియంత్రణ కేంద్రం దెబ్బతింటుంది. ఉష్ణోగ్రతను నియంత్రణ చేయలేదు. అధిక వేడికి శరీరంలో ఉన్న లవణాలు ఆవిరి అయిపోతాయి. దీంతో శరీరం నీరసించి, సడలిపోయి, పాడిబారి పోతుందని చెబుతున్నారు.

వడదెబ్బకు గురయ్యే లక్షణాలు

- నీళ్లు తాగుతున్నా... చెమట పట్టకపోవడం.
- నీరసం, చప్పలేనంత అలసట.
- తలనొప్పి, తల తిరగడం, కడుపులో తిప్పడం, వాంతి లక్షణాలు.
- లేచి నిలబడడానికి శక్తి లేకపోవడం. సొమ్మసిల్లి పోవడం.

నివారణ చర్యలు

- ఎండలో ఎక్కువగా తిరగరాదు.
- నీరు వంటి ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. దీనివల్ల శరీరం డీ హైడ్రేషన్‌కు గురవ్వకుండా కాపాడుకోవచ్చు.
- వేసవికాలంలో నలుపు రంగు, మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. వదులుగా ఉండే నూలు దుస్తులు వేసుకోవాలి.
- తలకు టోపీ పెట్టుకోవాలి లేదా రుమాలు చుట్టుకోవాలి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు ముఖానికి గుడ్డ కట్టుకోవడం మంచింది.
- ఎండలో తిరిగేవారు ప్రతీ గంటకు ఒకసారి కనీసం 250 మి.లీ నీరు తాగాలి.
- నీళ్లు తాగుతున్నా దప్పిక తీరకుండా ఉంటే, నిమ్మరసం, కొద్దిగా ఉప్పు కలిపి తాగడం మంచిది.
- చెమట ఎక్కువగా పడుతుంటే, నీరు ఇంకా ఎక్కువగా తీసుకోవాలి.
- నూనె, కొవ్వుతో కూడిన ఆహార పదార్థాలు వీలైనంత వరకు తగ్గించాలి.
- తేలికగా జీర్ణమయ్యే ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తీసుకోవాలి.
- ఎండలో నుంచి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు తీసుకోకూడదు.
- ఆరుబయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు.
- మద్యం సేవించడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. వీలైనంత వరకు తీసుకోకుండా ఉంటే మంచిది.

చికిత్స

- వడదెబ్బ సోకిన వ్యక్తిని చల్లని నీడ ఉన్న ప్రదేశానికి తరలించాలి.
- దుస్తులు వదులుచేసి, చల్లటి నీటిలో తడి గుడ్డ పెట్టుకొని పలుమార్లు తుడవాలి.
- శరీరంపై చల్లని నీళ్ల చిలకరించి.. ఫ్యాను కిందకు చేర్చాలి. లేదంటే విసనకర్రతో గాలి తగిలేటట్లు విసరాలి.
- ఎక్కువగా ద్రవ పదార్థాలు ఇవ్వాలి.
- స్పృహ కోల్పోయిన వారికి నోటి ద్వారా పానీయాలు ఇవ్వకూడదు.
- వీలైనంత త్వరగా ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించాలి.
- అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు ఐ.వి డ్రిప్ వెంటనే పెట్టాలి.
- 24 గంటలకు ఒకసారి కూడా మూత్రం రాకపోతే వైద్యుడిని సంప్రదించాలి.



విసన కర్రలు కొంటున్న నగర వాసులు



కర్భూజా తింటున్న యువకులు

కాంగ్రెస్ మరో జాబితా విడుదల

- సంబలపూర్ అభ్యర్థి మార్పు

భువనేశ్వర్: రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో భాగంగా మరో 2 లోక్‌సభ, 8 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సోమవారం ప్రకటించింది. సంబల్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గానికి నాగేంద్ర ప్రధాన్‌ను, కటక్ పార్లమెంట్ స్థానానికి సురేష్ మహాపాత్రో పేరును ఖరారు చేసింది. దులాల్ చంద్ర ప్రధాన్ స్థానంలో నాగేంద్ర ప్రధాన్ పోటీ చేయనున్నారు. దీంతో సంబల్‌పూర్ లోక్‌సభ రేసులో అనుభవజ్ఞుడైన యోధుడు ప్రవేశించాడు. ఈ నియోజకవర్గంలో పోటీ త్రిముఖంగా రక్తి కడుతుంది. బరిలో భారతీయ జనతా పార్టీ నుంచి ధర్మేంద్ర ప్రధాన్, బిజూ జనతా దళ్ నుంచి ప్రణబ్ ప్రకాష్ దాస్ ఉన్నారు. వీరితో నాగేంద్ర ప్రధాన్ కాంగ్రెసు అభ్యర్థిగా పోటీకి సిద్ధమయ్యారు.

అభ్యర్థి మార్పు

సంబల్‌పూర్ నుంచి దులాల్ ప్రధాన్‌ను లోక్‌సభ అభ్యర్థిగా కాంగ్రెస్ ఇటీవల ప్రకటించింది. ఇంతలో ఆ ప్రాంతంలో మారిన పోటీ వాతావరణం దృష్ట్యా ఆయన స్థానంలో నాగేంద్ర ప్రధాన్‌ని ఖరారు చేసి తాజా జాబితా విడుదల చేసింది. బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, బిజూ జనతా దళ్ ఆర్గనైజేషనల్ కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్ ఇప్పటికే ప్రతిష్టాత్మకమైన సంబలపూర్ పార్లమెంటరీ స్థానం రేసులో ఉన్నారు. నాగేంద్ర ప్రధాన్ 2014లో బీజేడీ టికెట్‌పై సంబల్‌పూర్ ఎంపీగా ఎన్నికయ్యారు. అంతేకాకుండా అతను 1990, 2000, 2004లో జనతా దళ్ (జేడీ), బిజూ జనతా దళ్ నుంచి 3 సార్లు అఠొమల్లిక్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈసారి సంబల్‌పూర్ నుంచి అధికార, విపక్షాలు బీజేపీ, బీజేడీ బరిలోకి దింపిన ఇద్దరు ఉద్దండులతో ప్రత్యక్షంగా తలపడాల్సి ఉంది. ఈ పోరులో నాగేంద్ర ప్రధాన్‌కు తగినంత అనుభవం ఉన్నందున గెలుపుపై దీమాగా ఉన్నారు.

ప్రతి ఎలక్షన్‌కు వినూత్న తీర్పు

వరుసగా 2009, 2014, 2019లో గత 3 ఎన్నికల్లో సంబల్‌పూర్ లోక్‌సభకు 3 వేర్వేరు పార్టీ అభ్యర్థులను స్థానికులు ఎన్నుకున్నారు. 2009లో కాంగ్రెస్‌కు చెందిన అమర్‌నాథ్ ప్రధాన్ 14,874 ఓట్ల తేడాతో సంబల్‌పూర్ లోక్‌సభ స్థానాన్ని గెలుచుకున్నారు. 2014లో బీజేడీ అభ్యర్థి నాగేంద్ర ప్రధాన్ 30,576 ఓట్ల తేడాతో గెలిపొందారు. 2019లో బీజేపీ అభ్యర్థి నితీష్ గంగ దేబ్ 9,162 ఓట్ల తేడాతో గెలిపొందారు. అయితే ఈసారి బరిలో ఇరువురు కొత్త ముఖాలు ఉన్నారు. వీరిలో ధర్మేంద్ర ప్రధాన్, ప్రణబ్ ప్రకాష్ దాస్ ఉండడం విశేషం.

అంసెబ్లీ స్థానాల అభ్యర్థులు వీరే..

అభ్యర్థి	నియోజకవర్గం
సోఫియా ఫిర్దౌస్	బారాబటి - కటక్
ప్రమోద్ కుమార్ హేంబ్రం	బరిపద(ఎస్టీ)
దేబీ ప్రసన్న చాంద్	జలేశ్వర్
అజయ్ సామల్	బొడొచొణ
ఫకీర్ సామల్	పాల్లొలొహొడ
ప్రతిమా మల్లిక్	జగత్‌సింగ్‌పూర్
మోనాలిసా లెంకా	బాలాసోర్
బైజయంతిమాల మహంతి	ఖండపడ

వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి స్వాధీనం

- 8 మంది అరెస్టు



పోలీసులకు చిక్కిన గంజాయి నిందితులు

రాయగడ: గంజాయి అక్రమ రవాణాపై జిల్లా పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సదరు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానితులుగా ఉన్నవారిని తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఇద్దరు యువతులు, మరో ముగ్గురు యువకుల నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో మహారాష్ట్రకు చెందిన శివతేజ్ ఠాకూర్, బిసంకటక్ పోలీసుస్టేషన్ పరిధి బొరిగుడ గ్రామానికి చెందిన హరేష్ కౌసల్య, రుజి హియాల్, గుడారి పోలీసు స్టేషన్ పరిధి సర్గిగుడ గ్రామానికి చెందిన రాజు పాణి, లిలిపాణిలు ఉన్నారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2.8 లక్షల ఉంటుందని పేర్కొన్నారు. అలాగే రైల్వేస్టేషన్ 5వ ప్లాట్‌ఫారంలో ఆర్పీఎఫ్ పోలీసులు ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా ముగ్గురు నిందితులను పట్టుకుని, వారి నుంచి 29.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో హర్యానా రాష్ట్రానికి చెందిన పానిపత్ జిల్లా కశ్యప్ నగర్‌కు చెందిన ఆరిఫ్, బిద్యానంద కాలనీకి చెందిన మహ్మద్ మొనీష్, కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పోలీస్‌స్టేషన్ పరిధి ఖుంటాగుడ గ్రామానికి చెందిన హేమంత్ ఖొర ఉన్నట్లు గుర్తించారు. వీరి నుంచి లభించిన గంజాయి విలువ సుమారు రూ.2.93 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

యువకుడిపై దుండగుల దాడి



గాయాలతో చికిత్స పొందుతున్న దయానిధి సాహు

బరంపురం: నగర సమీపంలోని దక్షిణపూర్‌లో యువకుడిపై దుండగులు మారణాయుధాలతో దాడిచేసి పరారైన ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయాలతో ఉన్న దయానిధి సాహుని బరంపురం ఎంకేసీజీ మెడికల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దుండగుల కోసం గాలిస్తున్నారు. కాగా యువకుడిపై దాడితో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూడో విడత పోలింగ్‌కు నోటిఫికేషన్

- మే 6 వరకు నామినేషన్లు
- మే 25న పోలింగ్

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పురస్కరించుకుని మూడో విడత పోలింగ్ కోసం ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ విడతలో పార్లమెంటరీ నియోజకవర్గాలు సంబల్‌పూర్, కెంజొహర్, ఢెంకనాల్, కటక్, పూరీ, భువనేశ్వర్ మరియు అనుబంధ అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. ఉత్తర్వులు జారీతో నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. మే 6వ తేదీ వరకు ఈ ప్రక్రియ నిరవధికంగా కొనసాగుతుంది. మర్నాడు మే 7న దాఖలైన నామినేషన్ దస్తావేజుల పరిశీలన ముగించి, 9వ తేదీ వరకు పోటీ నుంచి వైదొలిగేందుకు గడువు కల్పిస్తారు. మే 25న పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్లు లెక్కిస్తారు.

6 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో...

ఈ విడతలో 6 పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ జరుగుతుంది. సంబలపూర్, దేవ్‌గడ్, అంగుల్, కెంజొహర్, మయూర్‌భంజ్, ఢెంకనాల్, కటక్, నయాగడ్, పూరీ, ఖుర్దా జిల్లా ప్రాంతాల్లో సమగ్రంగా 94,41,797 మంది ఓటర్లు పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరిలో 48,26,375 మంది పురుషులు, 46,14,134 మంది మహిళలు, 1288 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 10,515 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో 36 అనుబంధ పోలింగ్ కేంద్రాలు పని చేస్తాయని ఎన్నికల సంఘం అధికార వర్గాలు తెలిపాయి. ఈ విడతలో 18 నుంచి 19 ఏళ్ల మధ్య 2,35,764 మంది సరికొత్త ఓటర్లు, 20 నుంచి 29 ఏళ్ల మధ్య 18,42,816 మంది ఓటర్లు నమోదై ఉన్నారు.

సప్తగిరికి అదృష్టం వరించేనా?

- 2019 ఎన్నికల్లో విజయం సాధించిన ఏకైక కాంగ్రెస్ ఎంపీ శంక ఉల్క
- బీజేడీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే గట్టి పోటీ..



సప్తగిరి ఉల్క (కాంగ్రెస్)



కౌశల్య హికాక (బీజేడీ)

జయపురం: కొరాపుట్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సప్తగిరి శంక ఉల్క 2019 ఎన్నికల్లో అద్భుత విజయం సాధించారు. కొరాపుట్ లోక్‌సభ స్థానంలో గల 7 నియోజకవర్గాల్లో 6 చోట్ల బీజేడీ అభ్యర్థులు గెలిపొందగా.. కేవలం ఒక్క స్థానంలోనే కాంగ్రెస్ విజయం సాధించింది. లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో నాలుగు సెగ్మెంట్లలో ఆధిక్యత సాధించి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఈ లోకసభ నియోజకవర్గంలో కొరాపుట్ జిల్లాలో నాలుగు సెగ్మెంట్‌లు ఉండగా.. రాయగడలో మూడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరిగింది. గుణుపూర్, రాయగడ, బిస్సమ్‌కటక్‌లలోనే కాకుండా లక్ష్మీపూర్, కొరాపుట్, పొట్టంగి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేడీ అభ్యర్థులు ఘన విజయం సాధించగా.. కేవలం జయపురం నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ గెలిపొందింది. ఆరు సెగ్మెంట్లలో విజయం సాధించిన బీజేబీ లోక్‌సభ స్థానంలో ఘోరంగా ఓటమి చెందింది. ఆ ఎన్నికల్లో 4 సెగ్మెంట్లలో ఉల్కకు ఆధిక్యత దక్కింది. రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీ గెలిచిన ఒకే ఒక్క స్థానం కొరాపుట్. 2019లో జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల ఫలితాలు ఇల్లా ఉన్నాయి. గుణుపురంలో బీజేడీ ఎమ్మెల్యేకు 48,839 ఓట్లు వచ్చి గెలిపొందారు. కాంగ్రెస్ అభ్యర్థికి 42,569 ఓట్లు వచ్చాయి. ఎంపీ ఎలక్షన్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి 53198 ఓట్లు రాగా, బీజేడీ ఎంపీ అభ్యర్థికి 52482 ఓట్లు వచ్చాయి.

- బిసమ్‌కటక్‌లో బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థి 66150 ఓట్లుతో విజయం సాధించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థికి 52818 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి 56,627 ఓట్లు రాగా, బీజేడీ ఎంపీ అభ్యర్థికి 66059 ఓట్లు వచ్చాయి.
- రాయగడలో బీజేడీ ఎమ్మెల్యేకు 47974 ఓట్లు వచ్చి గెలుపొందగా.. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థికి 39,657 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి 66127 ఓట్లు రాగా.. బీజేడీ ఎంపీ అభ్యర్థికి 59,665 ఓట్లు వచ్చాయి.
- లక్ష్మీపూర్‌లో బీజేడీ ఎమ్మెల్యేకు 45211 ఓట్లు వచ్చి విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థికి 44982 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి 49783 ఓట్లు రాగా, బీజేడీ ఎంపీ అభ్యర్థికి 41526 ఓట్లు మాత్రమే వచ్చాయి.
- కొరాపుట్‌లో బీజేడీ ఎమ్మెల్యేకు 48171 ఓట్లుతో గెలిపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థికి 41886 ఓట్లు పోలయ్యాయి. బీజేడీ ఎంపీ అభ్యర్థికి 45914 ఓట్లు రాగా.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి 43733 ఓట్లు వచ్చాయి.
- పొట్టంగిలో బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థికి 51244 ఓట్లు వచ్చి విజయం సాధించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థికి 46,989 ఓట్లు నమోదయ్యాయి. బీజేడీ ఎంపీ అభ్యర్థికి 51,064 ఓట్లు రాగా.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి 50,069 ఓట్లు వచ్చాయి.
- జయపురంలో బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థికి 54,334 ఓట్లు రాగా.. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థికి 59785 ఓటు వచ్చి గెలిపొందారు. బీజేడీ ఎంపీ అభ్యర్థికి 50102 ఓట్లు రాగా.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి 50897 ఓట్లు పోలయ్యాయి. ఈ పార్లమెంట్ స్థానంలో గుణుపూర్, రాయగడ, లక్ష్మీపూర్, జయపురం సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఎంపీకి ఆధిక్యత లభించటంతో విజయం సప్తగిరి శంకర ఉల్కను వరించింది. 2024 ఎన్నికల్లోనూ బీజేడీ ఎంపీ అభ్యర్థిగా కౌశల్య హికాక, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సప్తగిరి శంకర ఉల్క పోటీలో ఉన్నారు. ఎంత మంది బరిలో ఉన్నా.. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేడీ అభ్యర్థుల మధ్యే ఉంటుందని విశ్లేషకుల మాట. ఈ సారి కూడా సప్తగిరికి అదృష్టం వరిస్తుందా, లేదా మరికొద్ది రోజుల్లో తేలనుంది.

క్లుప్తంగా

రూ.2 లక్షల విరాళం



రాతి శిలను ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: రాజవీధిలోని జగన్నాథ మందిర పునర్నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త వైశ్యరాజు కాశీరాజు దంపతులు రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. కోమటి వీధిలో తమ ఇంటి వద్ద పవిత్ర శిలకు పూజలు చేశారు. జగన్నాథ భక్త బృందంతో కలిసి రాజవీధి వరకు ఊరేగింపు చేపట్టారు. అనంతరం రాజవీధిలో గల జగన్నాథ మందిరం నిర్మిస్తున్న స్థలం వద్ద పవిత్రమైన రాతి శిలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో పర్లాకిమిడి సినీ ఎగ్జిబిటర్స్ సంఘం అధ్యక్షుడు వైశ్యరాజు బాలజీరాజు దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ సేవా ట్రస్టు ఇన్‌చార్జి దుర్గామాధవ్ పాణిగ్రాహి, భీంసేన్ పండా తదితరులు పాల్గొన్నారు.

బీజేడీ అభ్యర్థి వ్యూహాత్మకంగా ప్రచారం



మైనార్టీలతో భేటీ అయిన అనసూయా మాఝి

రాయగడ: అత్యంత కీలకంగా మారిన రాయగడ శాసనసభ స్థానం నుంచి బీజేడీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అనసూయా మాఝి వ్యూహాత్మకంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈసారి ఎలాగైన ఈస్థానాన్ని దక్కించుకునేందుకు పావులు కదుపుతునానరు. బీజేడీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ఇప్పటికే పట్టణంలోని వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల్లో సహకరించాలని అభ్యర్థిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలో కీలకంగా మారిన మైనార్టీవర్గాల ఓట్లను దక్కించుకునే ప్రయత్నంలో భాగంగా అనసూయా మాఝి ఆ వర్గాల ప్రతినిధులు, మత పెద్దలతో ఆదివారం సాయంత్రం బీజేడీ పార్టీ కార్యాలయంలో భేటీ అయ్యారు. రాయగడ శాసనసభ స్థానం నుంచి ప్రప్రథమంగా ఒక మహిళకు అవకాశం కల్పించిన బీజేడీకి మద్దతు పలికి తనను గెలిపించాలని ఆమె కోరారు.

ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయులు సస్పెన్షన్





సస్పెన్షన్‌కు గురైన గౌతం చరణ్ సాహు, మనోజ్‌కుమార్ భాత్ర

కొరాపుట్: రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యక్తిగత సలహాదారుడు, 5టీ చైర్మన్ వి.కార్తికేయ పాండ్యన్ కార్యక్రమాలకు హాజరైన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురయ్యారు. నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర అందుకు తగ్గ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 24వ తేదీన పాండ్యన్ నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం, తెంతుల కుంటి ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాలకు పపడాహండికి చెందిన ఉపాధ్యాయుడు గౌతం చరణ్ సాహు, డాబుగాంకి చెందిన ఉపాధ్యాయుడు మనోజ్ కుమార్ భాత్రలు హాజరయ్యారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వీరి ఫొటోలను కొంతమంది తీసి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ వీరిద్దరిని సస్పెండ్ చేస్తూ ఆదేశించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- ఆచూకీ లేని భర్త



రక్తపు మడుగులో రింకు మృతదేహం

మల్కన్‌గిరి: భర్తతో కలిసి వెళ్లిన భార్య శవమై తేలింది. భర్త ఆచూకీ లేకుండా పోయింది. మల్కన్‌గిరి సమితి సింగరాజ్‌కొండ గ్రామ సమీపంలో భార్య మృతదేహాన్ని సోమవారం తెల్లవారుజామున గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కోరుకొండ సమితి ఎం.వి.35 గ్రామానికి చెందిన బిప్లబ్ మాండాల్ తన భార్య రింకు మడాంల్‌తో కలిసి పని నిమిత్తం మల్కన్‌గిరి పట్టణానికి ఆదివారం వచ్చారు. పని ముగించుకున్న తరువాత రింకు తన తల్లి సంజాయ్ బోబోమ్‌కు ఫోన్ చేసి ఆడపడుచును చూసేందుకు వారి ఇంటికి వెళ్తున్నామని చెప్పారు. అయితే సాయంత్రం అయినప్పటికీ వారు తిరిగి రాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సింగరాజ్‌కొండ గ్రామస్తులకు మహిళ మృతదేహం కనిపించడంతో వారు మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఐఐసీ రీగాన్ కీండో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి వివరాలు సేకరించారు. రింకు తల్లి సంజాయ్ బోబోమ్ ఫోన్ చేసి సింగరాజ్‌కొండ గ్రామానికి రప్పించారు. అక్కడ రక్తపు మడుగులో పడిఉన్న కుమార్తె మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా రోదించింది. తన కుమార్తెను ఎవరో హత్య చేశారని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రింకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా రింకు భర్త ఆచూకీ తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

నర్మదా పుష్కరాలకు వేళాయె..

- ఎన్నికల నేపథ్యంలో కొంతమంది పుష్కరాలకు దూరం



నర్మదా నది జన్మస్థలం అమర్ కంటక్

కొరాపుట్: నర్మదా నది పుష్కరాలు సమీపించాయి. మే ఒకటి నుంచి 12వ తేదీ వరకూ పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఎన్నికల నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో వారికి పుష్కరాలకు వెళ్లే అవకాశం అంతగా లేదు. మరికొంతమంది పుష్కరాలకు ప్రాధాన్యం ఇవ్వాలా.. ఎన్నికలకు ఇవ్వాలా అని ఈ ప్రాంతంలో నివసిస్తున్న తెలుగువారు తలలు పట్టుకుంటున్నారు. దేశంలో ఏప్రాంతంలో తెలుగు ప్రజలు నివసిస్తున్నా పుష్కరాలకు మాత్రం అధిక ప్రాధాన్యం ఇస్తారు. అందుకే నాలుగు నెలలు ముందు నుంచే రైల్వే రిజర్వేషన్లు చేయించుకుంటారు. పుష్కరాల్లో భాగంగా అధిక ప్రజలు ఉజ్జయిని వచ్చేందుకు ఆసక్తి చూపుతారు. ఈసారి ఎన్నికల ప్రభావం పుష్కరాలపై పడింది. సుమారు రెండు నెలల ముందే ఎన్నికల తేదీలు వెలువడ్డాయి. మే 13వ తేదీన ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ జరగనుంది. దీంతో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆయా రోజులలో ప్రయాణాలు చేయలేక చాలా మంది బాధతో పుష్కరాలు రద్దు చేసుకున్నారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు విమానంలో వెళ్లి రావడానికి మూడు రోజుల ప్రయాణానికి సిద్ధమవుతున్నారు.

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలకు ఉపశయనం

పుష్కరాలకు ఎన్నికలు ఆటంకం అందరికీ వచ్చినప్పటికీ కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలకు ఇబ్బంది లేకుండా పోయింది. నర్మదా నది జన్మ స్థలం అమర్ కంటక్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఉంది. అది నబరంగ్‌పూర్ పట్టణానికి 500 కిలో మీటర్ల దూరంలో, జయపూర్‌కి 550 కిలో మీటర్ల దూరంలో ఉంది. రాయ్‌పూర్ మీదుగా నాణ్యమైన రోడ్డు ఉంది. దీంతో పరిస్థితి గమనించిన రెండు పట్టణాల యువకులు ఒక్క రోజు పుష్కర యాత్రకి ప్రత్యేక బస్సులు వేశారు. ముందు రోజు రాత్రి నుంచి బస్సులు బయలు దేరి ఉదయానికి అమర్ కంటక్ చేరుతాయి. అదే రోజు రాత్రి తిరుగు బయలుదేరి ఉదయానికి స్వస్థలాలకు బస్సులు చేరుతున్నాయి. బస్సు ఆపరేటర్ల మధ్య పోటీ ఏర్పడి టిక్కెట్ల ధర కూడా తగ్గించేస్తున్నారు. రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర ప్రజలు కూడా ఈ ఒక్క రోజు ప్రయాణం కోసం నబరంగ్‌పూర్, కొరాపుట్ జిల్లాల వారిని సంప్రదిస్తున్నారు.

రూ.3.50 లక్షలు స్వాధీనం



పోలీసులు స్వాధీనపరచుకున్న నగదు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎన్నికల పర్వం ఆరంభం కావడంతో నగదు, ఉచితాల అక్రమ తరలింపు, రవాణా పట్ల తనిఖీ వర్గాలు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నాయి. పశ్చిమ ఒడిశాలో సంబలపూర్ పార్లమెంటరీ నియోజకవర్గం కీలకంగా మారింది. మే 25న రాష్ట్రంలో మూడో దశలో సంబల్‌పూర్ లోక్‌సభ స్థానం, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రాంతంలో ఇటీవల కాలంలో తరచూ నగదు అక్రమ రవాణా తనిఖీ అధికారుల నిఘాలో చిక్కుతుంది. తాజా సంఘటనలో సంబలపూర్ జిల్లా ఖేత్‌రాజ్‌పూర్‌లో కారులో అక్రమంగా తరలిపోతున్న రూ.3.50 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంబలపూర్ లక్ష్మీడుబురి సమీపంలో తనిఖీ చేస్తున్న సమయంలో ఖేత్‌రాజ్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసులకు అనుమానంతో కారును అడ్డగించారు. వాహనాన్ని తనిఖీ చేయగా రూ.500 నోట్ల కట్టలు (రూ.3.50 లక్షలు) గుర్తించారు. కారు డ్రైవర్‌ను నిలదీయగా.. డబ్బును సంబల్‌పూర్ నగరంలోని ఒంయిలపల్లి నుంచి ఖేత్‌రాజ్‌పూర్‌కు తీసుకువెళ్తున్నట్లు వెల్లడించాడు. ఖేత్‌రాజ్‌పూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, ఆ డబ్బు తన కస్టమర్ల నుంచి బీమా కంపెనీ వసూలు చేసిన ప్రీమియం మొత్తం అని డ్రైవర్ పేర్కొన్నాడు. అతని వాదనకు మద్దతుగా ఎటువంటి అనుబంధ, సాక్ష్యాధార పత్రాన్ని సమర్పించలేకపోయాడు. ఎన్నికల ఆంక్షల ప్రకారం రూ.50 వేలకు మించి అనుమతి లేకుండా తీసుకువెళ్లకూడదు. ఈ నేపథ్యంలో ఆ డబ్బును సీజ్ చేసి ప్రభుత్వ ఖజానాలో జమచేస్తామన్నారు. చెల్లుబాటు అయ్యే పత్రాలను అధికారులకు సమర్పించిన తర్వాత సంబంధిత యజమానికి తిరిగి ఇవ్వస్తామని పోలీసు అధికారి స్పష్టం చేశారు.

పర్లాకిమిడిలో 10 మంది.. మోహనాలో ఏడుగురు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మోహనా ఎస్టీ నియోజకవర్గంలో మొత్తం 8 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. ఇంటిపెండెంట్ అభ్యర్థి పూర్ణచంద్ర గోమాంగో (ఆర్.ఉదయగిరి) పోటీ నుంచి ఉపసంహరించుకున్నారు. ఏడుగురు అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్నారు. పర్లాకిమిడి నియోజకవర్గంలో మొత్తం 11 మంది నామినేషన్లు వేయగా.. జాతీయ ఆప్నీ పార్టీ అభ్యర్థిని ప్రీతిలతా పట్నాయక్ చివరి నిమిషంలో నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ఎన్నికల బరిలో పది మంది అభ్యర్థులు మిగిలారని ఎన్నికల అధికారి, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తెలిపారు. పర్లాకిమిడి నియోజకవర్గం ఎన్నికల బరిలో కాంగ్రెస్ పార్టీ నుంచి బిజయకుమార్ పట్నాయక్, బీజేడీ నుంచి రూపేష్ పాణిగ్రాహి, బీజేపీ నుంచి కోడూరు నారాయణ రావు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పైల మురళీకృష్ణ, మనోజ్ కుమార్ బోడోనాయక్ (ఆప్ పార్టీ), ప్రవీంద్ర సింగ్ (మానస్ లోక్‌శక్తి దళ్), స్వతంత్ర అభ్యర్థులుగా ఆయోద్ బర్దన్, బికాష్ చంద్ర సింగ్, సంజయ్ కుమార్ రౌత్, బిద్యాధర్ మహంకుడో ఉన్నారు.

350 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు, పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కుర్మానూర్ పంచాయతీ కేందుగూడ గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి పోలీసలు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 350 కేజీల గంజాయ్‌ని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. కేందుగూడ నుండి ఆంధ్రప్రదేశ్‌కు గంజాయిని అక్రమంగా రవాణా చేయడానికి కొంతమంది నిల్వ చేసినట్టు కలిమెల పోలీసులకు ముందస్తుగా సమాచారం వచ్చింది. దీంతో ఆదివారం రాత్రీ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు కేందుగూడ అటవీ ప్రాంతం వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా గుట్టురట్టయింది. వారి వద్ద ఉన్న గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని సోమవారం తుకం వేయగా 350 కేజీలు ఉంది. దీని విలువ 20 లక్షల రూపాయల వరకూ ఉంటుందని కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి తెలిపారు.

కార్మిక కల్యాణ పథకాల అమలులో ఒడిశాది ప్రథమ స్థానం



మాట్లాడుతున్న జయపురం బీజేడీ అభ్యర్థి ఇందిర నందో

జయపురం: ఒడిశా రాష్ట్రం కార్మిక కల్యాణ పథకాల అమలులో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని పలువరుబీజేడీ వక్తలు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం స్థానిక సంధ్యా పంక్షన్ హాల్‌లో నిర్వహించిన బిజూ శ్రామిక సమ్మేళనానికి పలువురు బీజేడీ నేతలు హాజరయ్యారు. జయపురం విధాన సభ నియోజకవర్గం బీజేడీ అభ్యర్థి డాక్టర్ ఇందిరా నందో మాట్లాడుతూ రాష్ట్రంలో నవీన పట్నాయక్ నేతృత్వంలో బీజేడీ ప్రభుత్వం కార్మికుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఆరోగ్య బీమా కార్డులు ద్వారా వైద్య సైకర్యాలు కల్పిస్తుందని, విద్యా ప్రగతికి ఎనలేని కృషి చేస్తుందని వివరించారు. రాష్ట్ర బిజూ శ్రామిక సమాఖ్య కార్యదర్శి, కటక్ మేయర్ సుభాష్ సింగ్ మాట్లాడుతూ.. కార్మికుల రోజువారి వేతనం ఇతర రాష్ట్రాల్లో రూ. 20 నుంచి 30 పెంచగా ఒడిశా ప్రభుత్వం రూ.105 పెంచి కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేసిందని వెల్లడించారు. మన రాష్ట్రం నుంచి 12 లక్షల మంది కార్మికులు ఇతర రాష్ట్రాలకు వలస వెల్లగా, ఇతర రాష్ట్రాల నుంచి 9 లక్షల మంది ఒడిశాలో పనిచేస్తున్నారని వివరించారు. శ్రామికులకు ఇళ్లు, రేషన్‌కార్డులు సమకూర్చి భద్రతను కల్పిస్తుందన్నారు. నవీన్ పట్నాయక్ మరోసారి ముఖ్యమంత్రి అయిన వెంటనే జయపురం సేవా పేపరు మిల్లు సమస్యను పరిష్కరిస్తామని, కార్మికులకు యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలా చూస్తామన్నారు. బిజూ శ్రామిక సంఘ జయపురం కార్యదర్శి బాలా రాయ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ కార్మిక సంఘం సాధారణ కార్యదర్శి రాజీవ లోచన మహంతి, రాయగడ కార్మిక నేత నిరంజన్ పాత్రో, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 2కి చేరిన వడదెబ్బ మృతులు

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్రమైన వేడిగాలులు కొనసాగుతున్నాయి. సోమవారం వడదెబ్బతో మరో వ్యక్తి మరణించాడు. దీంతో రాష్ట్రంలో వడదెబ్బ కారణంగా మృతుల సంఖ్య రెండుకు పెరిగింది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం ఢెంకనాల్ జిల్లాలో తాజాగా వడదెబ్బ మరణం నమోదైంది. ఈ వేసవిలో రాష్ట్రంలో మొదటి వడదెబ్బ మరణం ఇటీవల బాలాసోర్ జిల్లాలో నమోదైన విషయం తెలిసిందే. రాష్ట్రంలో వడదెబ్బ పీడితుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇప్పటివరకు మొత్తం 257 మంది వేడి సంబంధిత అనారోగ్యం, వడదెబ్బకు గురయ్యారు. వారంతా రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

సుందర్‌గడ్‌లో అత్యధికం

సుందర్‌గడ్ జిల్లాలో అత్యధికంగా 60 వడదెబ్బ సంబంధిత పీడిత కేసులు నమోదయ్యాయి. మయూర్‌భంజ్‌లో 40, ఖుర్దా జిల్లాలో 36 మంది వడదెబ్బ పీడితులను గుర్తించారు. ఖుర్దా జిల్లాలో నమోదైన మొత్తం 36 మంది పీడితుల్లో 18 మంది రోగులు భువనేశ్వర్‌లోని క్యాపిటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గత రెండు వారాలుగా రాష్ట్రం తీవ్రమైన వేడి గాలులతో కొట్టుమిట్టాడుతోంది. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రత నమోదవుతోంది. మే 3 వరకు రాష్ట్రంలో తీవ్రమైన వేడిగాలులు కొనసాగుతాయని, ఈ సమయంలో కొన్ని జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 3 నుండి 6 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. మరోవైపు ప్రబలమైన వడగాలుల వాతావరణం మధ్య కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వాన మధ్య పరిసర ప్రాంతాల్లో రాష్ట్రంలో వేడిమి స్థాయి తాత్కాలికంగా స్వల్ప మోతాదులో తగ్గుతోంది. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలు సరికి 40 డిగ్రీల సెల్సియస్ పైబడి గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాల వివరాలు పరిశీలిస్తే...

ప్రాంతం	గరిష్ఠ ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
కెంజొహర్	43.0
ఝార్సుగుడ	42.8
సంబల్‌పూర్	42.6
హిరాకుద్	41.8
రౌర్కెలా	41.8
బాలాసోర్	41.4
భువనేశ్వర్	41.3
చాంద్‌బాలి	40.7

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- ఉద్యోగినిపై సస్పెన్షన్ వేటు



ప్రచారంలో పాల్గొన్న గీతాంజలి భుయ్యాన్

పర్లాకిమిడి: ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ ఒక జాతీయ పార్టీ ర్యాలీలో పాల్గొని ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు పర్లాకిమిడి నియోజకవర్గం గుమ్మా బ్లాక్ బోడోకోలాకోట్ ఒడిశా లివ్లీహుడ్ మిషన్ గ్రామ పంచాయతీ స్థాయి ఫెడరేషన్ ఉద్యోగిని గీతాంజలి భుయ్యాన్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్మృతిరంజన్ ప్రధాన్ ఉద్యోగం నుంచి తొలగించారు. ఈనెల 24న గుమ్మా నుంచి పర్లాకిమిడి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ర్యాలీలో గీతాంజలి భుయ్యాన్ పాల్గొన్నందుకు చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయితో పట్టుబడ్డ మహిళ



గంజాయితో పట్టుబడిన గీతా బిహార్

రాయగడ: గంజాయి అక్రమ రవాణా చేస్తుండగా గీతా బిహర్ అనే మహిళ అబ్కారీశాఖ అధికారులకు పట్టుబడింది. సొమవారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో ఆమెను అదుపులోకి తీసుకొని బ్యాగులను తనిఖీ చేయగా అందులో 11.750 కిలోల గంజాయి లభించింది. ఆమెను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

జయపురంలో బీజేడీకి షాక్



తృప్తి పట్నాయక్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బహిణీపతి

- కాంగ్రెస్‌లో చేరిన తృప్తి పట్నాయక్



మహిళా కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాహిణీపతి



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ ఎమ్మెల్యే, నాయకులు

జయపురం: జయపురం పట్టణ బీజేడీ ఉపాధ్యక్షురాలు తృప్తి పట్నాయక్ వందలాది మంది మహిళా సహచరులతో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి నివాసంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మిశ్రణ మేళాలో ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, ఆయన సతీమణి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సాధారణ కార్యదర్శి మీణాక్షి బాహిణీపతి ఆహ్వానించారు. కాంగ్రెస్ ఆశయాలకు, ముఖ్యంగా ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులమయ్యామని తృప్తి పట్నాయక్ వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో బాహిణీపతి విజయానికి తామంతా సైనికుల్లా పని చేస్తామని ప్రకటించారు. జయపురం పట్టణం, సమితి ప్రాంతాల నుంచి పలువురు బీజేడీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శశిభూషణ పాత్రో, జయపురం సమితి కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత నాయిక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ సామంతరాయ్, ఎ.చిన్నారావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నళినీ రథ్, శీతల రథ్, జిల్లా కాంగ్రెస్ మీడియా సెల్ చీఫ్ సుకాంత పట్నాయక్, గౌరవ భాత్ర, బినీత సతమన్ తదితరులు పాల్గొన్నారు.

వేడెక్కిన ఎన్నికల ప్రచారం

- 3న రాహుల్‌గాంధీ, 4న నవీన్ పట్నాయక్ రాయగడ రాక



రాహుల్ గాంధీ



నవీన్ పట్నాయక్

రాయగడ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని పార్టీల నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ఆ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ఈ నెల మూడో తేదీన రాయగడలో ప్రచారం చేయనున్నారు. అలాగే బీజేపీ పార్టీ తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నాలుగో తేదీన రాయగడలో పర్యటించి ఎన్నికల ప్రచారం చేస్తారని ఆ పార్టీ వర్గాలు తెలియజేశాయి. అత్యంత కీలకంగా మారిన రాయగడ శాసనసభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి అప్పలస్వామి కద్రక, బీజేడీ నుంచి అనసూయా మాఝిలు పోటీ చేస్తున్నారు. స్థానిక జేఎస్‌కో మైదానంలో జరగనున్న బహిరంగ సభలో రాహుల్‌గాంధీ ప్రసంగించనున్నారు. ఆయనతో పాటు పీసీసీ అధ్యక్షులు శరత్ పట్నాయక్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ తనవాస్ చౌదరి, అజయ్‌కుమార్, కోఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లు హాజరవుతారు. అలాగే నాలుగో తేదీన జిల్లాలోని కాశీపూర్ సమితి టికిరిలో జరగనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పాల్గొని బీజేడీ అభ్యర్థి అనసూయా మాఝి తరపున ప్రచారం చేస్తారు. ఈ మేరకు అక్కడ జరిగే సన్నహాలకు సంబంధించి బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు సోమవారం పర్యటించి ఏర్పాట్లు సమీక్షించారు.

ఓటు హక్కుపై అవగాహన



ప్లకార్డులతో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

జయపురం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా జిల్లా అధికారులు, ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆదివారం రాత్రి జయపురం రఘునాథ్ మందిరం కూడలి వద్ద సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. జయపురంలో గల వివిధ సాంస్కృతిక, నృత్య, సంగీత సంస్థల కళాకారులతో పలు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సాంస్కృతిక ప్రదర్శనలో అనేక మంది బాల కళాకారులు వివిధ స్లోగన్‌లు, ప్లాకార్డులు ప్రదర్శించారు. జిల్లా ఎన్నికల పర్యవేక్షకులు ఐఏఎస్ అధికారి ప్రియాంక గోస్వామి, జిల్లా కలక్టర్ వి.కీర్తివాసన్, జిల్లా పరిషత్ ఉన్నయన అధికారి దేవాశిశ్ పట్నాయక్, డుడార్ ప్రాజెక్టు డైరెక్టర్ దేవీప్రసాద్ టల్లీ, అదనపు జిల్లా కలక్టర్ లొగ్నజిత్ రౌత్, జయపురం సబ్‌కలెక్టర్ ప్రభాత్ కుమార్ పోరిడ, జయపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారి అంకిత కుమార్ వర్మ, బీడీఓ శక్తి మహాపాత్రో, జయపురం మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, జిల్లా సాంస్కృతిక అధికారి ప్రీతి సుద్ధ జెన తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో అగ్ని ప్రమాదం



బ్యాంకు వెలుపల గుమిగూడిన జనం

- మంటల్లో చిక్కుకున్న నలుగురుని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



మంటల్లో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



అంధకారంగా మారిన బ్యాంకు కార్యాలయం లోపలి భాగం

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లా బరిపద వద్ద ఉన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. బ్యాంకు ఆవరణలోని మూడో అంతస్తులో ఉన్న క్యాంటీన్లో మంటలు చెలరేగి ఇతర ప్రాంతాలకు విస్తరించినట్లు సమాచారం. అగ్ని ప్రమాదానికి అసలు కారణం ఇంకా తెలియాల్సి ఉంది. ఎల్‌పీజీ సిలిండర్ లీక్‌తో మంటలు చెలరేగినట్లు అనుమానిస్తున్నారు. ఆ సమయంలో బ్యాంకులో పలువురు సిబ్బంది, ఖాతాదారులు ఉన్నారు. ఓ మహిళా ఉద్యోగి సహా నలుగురు వ్యక్తులు చెలరేగిన మంటల్లో చిక్కుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో వారు సురక్షితంగా బయటపడ్డారు. రెండు అగ్నిమాపక యంత్రాలతో బ్యాంకు వద్దకు చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. భవనంలో చిక్కుకున్న వారిని రక్షించారు. పొగలు కమ్ముకోవడంతో భవనం లోపల అంధకార పరిస్థితి నెలకొంది. దీంతో సహాయక చర్యలు కష్టతరంగా మారాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

క్లుప్తంగా

నగదు సీజ్

వంగర: మండల పరిధి బంగారువలస చెక్ పోస్టు వద్ద బస్సులో తీసుకువెళ్తున్న రూ. 2,59,300 నగదు ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వై.వి.జనార్ధన్ తెలిపారు. సోమవారం ఎస్.ఎస్.టి. బృందం చేపట్టిన తనిఖీల్లో ఈ నగదు గుర్తించడంతో వారు స్వాధీనం చేసుకున్నారని ఎస్‌ఐ తెలిపారు.

పసికందు మృతదేహం లభ్యం

మెంటాడ: ఆంధ్రా బ్రిడ్జి కింద చంపావతి నదిలో పసికందు మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఈ మేరకు ఎస్‌ఐ బి.దేవి తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు నిర్వహించారు. ఈ మేరకు స్థానికుల సమాచారం మేరకు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి


చందక పుష్ప (ఫైల్)

భోగాపురం: మండలంలోని రాజాపులోవ గ్రామానికి చెందిన చందక పుష్ప(17) అనే వివాహిత కేజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాజాపులోవ గ్రామానికి చెందిన చందక పుష్ప, కిలారి శ్రీనులకు పెద్దల సమక్షంలో మూడేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరి దంపతుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో రెండేళ్ల కిందట పుష్ప అదే గ్రామంలో నివాసముంటున్న తన తల్లి ముత్యాలమ్మ ఇంటికి వెళ్లిపోయింది. భర్తతో నాకు సంసారం చేయడం ఇష్టం లేదు, నేను వేరే వ్యక్తిని ఇష్టపడ్డాను, అతనితో నాకు పెళ్లి చేయండి అని తల్లిపై ఒత్తిడి చేసింది. దీనిపై తల్లి కుమార్తె పుష్పను మందలించింది. దీంతో మనస్తాపం చెందిన పుష్ప ఈ నెల 23న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయేందుకు ప్రయత్నించింది. విషయం గమనించిన చుట్టుప్రక్కల ప్రజలు, కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కిందకు దించి విశాఖపట్నం కేజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి ముత్యాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన పీసీసీ సభ్యుడు

- పార్టీలోకి ఆహ్వానించిన జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ముగడ వెంకటరమణ

బొబ్బిలి: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కీలక నాయకుడిగా పనిచేస్తున్న, పీసీసీ సభ్యుడు ముగడ వెంకటరమణ సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ డిప్యూటీ జోనల్ కోఆర్డినేటర్, జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆయనకు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా చిన్న శ్రీను సూచించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, బొబ్బిలి వైఎస్సార్ సీపీ పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ టిక్కెట్లు అమ్ముకుంటున్న షర్మిళ

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా చేరిన తరువాత సీనియర్లకు గౌరవం ఇవ్వకుండా వారికి ఇవ్వాల్సిన టిక్కెట్లను డబ్బులిచ్చిన వారికే విక్రయించడం షర్మిళకు తగదని ముగడ వెంకట రమణ అన్నారు. వైఎస్సార్ సీపీలో చేరడానికి ముందుగా సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో సేవలందిస్తున్నానన్నారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వాసిరెడ్డి వరద రామారావు బీజేపీకి వెళ్లినప్పుడు కూడా తాను కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉంటే తనను నట్టేట ముంచారన్నారు. వైఎస్ షర్మిళ ఇటీవల పీసీసీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ మరింత అధఃపాతాళానికి దిగజారిపోయిందన్నారు. అందుకే ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరనున్నట్టు విలేకర్లకు తెలిపారు.

పట్టపగలే చైన్ స్నాచింగ్


బాధిత మహిళ చింత చిన్నమ్మడు

వంగర: మండల పరిధి మగ్గూరు-మడ్డువలస గ్రామాల సమీపంలో పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. మగ్గూరు గ్రామానికి చెందిన చింత చిన్నమ్మడు పశువుల మేతకు తీసుకువెళుతుండగా రోడ్డుపై ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడును లాక్కుని పరారయ్యారు. ఈ విషయంపై ఆమె వంగర పోలీసులను ఆశ్రయించడంతో ఎస్‌ఐ వై.వి.జనార్ధన్ అరసాడ జంక్షన్ వద్ద సీసీ పుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సంగీత సరస్వతికి 105 ఏళ్లు

- నేడు మహారాజా సంగీత, నృత్య కళాశాల వార్షికోత్సవం
- కళాశాల తొలి అధ్యక్షునిగా హరికథా పితామహుడు ఆధిభట్ల


మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల


కళాశాల కచేరీ మందిరంలో సాధన చేస్తున్న విద్యార్థులు


కళాశాల ఆవరణలో కొలువుదీరిన సంగీత సరస్వతీ

విజయనగరం టౌన్: సంగీత సరస్వతి 105 ఏళ్ల పుట్టినరోజు వేడుకలకు సిద్ధమవుతోంది. వందేళ్ల కిందట విజయనగర మహారాజులు తమ హయాంలో సంగీతానికి అధిక ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతో 1919 ఫిబ్రవరి 5న సంగీత కళాశాలను స్థాపించారు. నాడు రాజులు నాటిన చిన్న బీజాలు నేడు వటవృక్షాలుగా ఎదిగి కళాశాల ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది. ప్రతీ ఏటా ఏప్రిల్ 30న కళాశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాక్షి ప్రత్యేక కథనం.

కళాశాల తొలి అధ్యక్షునిగా ఆదిభట్ల

విజయనగరం పేరు చెప్పగానే ఎవరికైనా స్ఫురించేది సంగీత కళాశాల. పూసపాటి విజయరామ గజపతులు విజయనగరంలో 1919 ఫిబ్రవరి 5న విజయరామ గాన పాఠశాల (నేటి సంగీత, నృత్య కళాశాల)ను ప్రారంభించారు. కోటకు వెనుకవైపు గల ఇప్పటి టౌన్‌హాల్‌ను ఇందుకోసం కేటాయించారు. సువిశాలమైన ఈ భవనంలోనే సంగీత కళాశాలను నిర్వహిస్తున్నారు. దక్షిణ భారతదేశంలోనే ప్రప్రథమంగా నెలకొల్పిన సంగీత కళాశాలకు బహుముఖ ప్రజ్ఞాశాలి, హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు తొలి అధ్యక్షునిగా పని చేశారు. పద్మశ్రీ డాక్టర్ ద్వారం వెంకటస్వామినాయుడు వయోలిన్ ప్రొఫెసర్‌గా నియమించి సంస్థను ప్రారంభించారు. విజయరామ గజపతుల తర్వాత అలక్ నారాయణ్ గజపతులు, పీవీజీ రాజుల హయాంలో కళాశాల పూర్తి హంగులతో రూపుదిద్దుకుంది. ప్రపంచంలో మహా విద్వాంసులు పదివేల మందికి పైగా ఇక్కడ విద్యాభ్యాసం చేశారు. వారిలో నేదునూరి కృష్ణమూర్తి, ఘంటసాల వెంకటేశ్వరరావు, పి.సుశీల, సాలూరు రాజేశ్వరరావు, చిన సత్యనారాయణ తదితరులున్నారు.

ఇప్పటి వరకూ..

1919 ఫిబ్రవరి 5న మహారాజా విజయరామగజపతి రాజు వ్యవస్థాపక అధ్యక్షులుగా హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు మొదటి ప్రిన్సిపాల్‌గా 1919 నుంచి 1936 వరకూ పని చేశారు. అనంతరం సంగీత కళానిధి, సంగీత రత్నాకర, పద్మశ్రీ డాక్టర్ ద్వారం వెంకటస్వామినాయుడు 1936నుంచి 1953 వరకూ పని చేశారు. ఆయన తర్వాత ద్వారం సంగీత కళాభూషణ ద్వారం నరసింగరావు 1953 నుంచి 1960 వరకూ, సంగీత కళాప్రపూర్ణ ద్వారం భావనారాయణరావు 1962 నుంచి 1973 వరకూ, సంగీత చూడామణి నేదునూరి కృష్ణమూర్తి 1977 నుంచి 1979 వరకూ అనంతరం కుమారి శ్రీరంగం గోపాలరత్నం 1979 నుంచి 1980 వరకూ పని చేశారు. అనంతరం ద్వారం దుర్గాప్రసాదరావు 1982 నుంచి 2000 వరకూ పని చేశారు. వీరి తర్వాత పీవీఎస్ శేషయ్య శాస్త్రి 2000 నుంచి 2006 వరకూ పని చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌గా బురిడి అనూరాధా పరశురామ్, ఆమె అకాల మరణం తర్వాత ప్రస్తుతం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కెవిఎల్ఎస్.శాస్త్రి పని చేస్తున్నారు.

వార్షికోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం



మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల 105వ వార్షికోత్సవం వేడుకలకు సర్వం సిద్ధమైంది. కళాశాల కచేరీ మందిరంలో సాయంత్రం 5 గంటల నుంచి కళాశాల విద్యార్థులతో సంగీత, నృత్య కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం నిర్వహించే సభా కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ జి.సన్యాసమ్మ, గొట్టుముక్కల రవివర్మలు పాల్గొననున్నారు. సభానంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం ఉంటుంది.

– కెవిఎల్ఎస్.శాస్త్రి, ప్రిన్సిపాల్, మహారాజా సంగీత, నృత్య కళాశాల, విజయనగరం

1953లో ప్రభుత్వ ఆధీనంలోకి..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 1953లో కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంది. నాటి నుంచి మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాలగా రూపాంతరం చెందింది. అప్పుడు కేవలం ఐదు విభాగాలు గాత్రం, వీణ, వయోలిన్, మదంగం, భరతనాట్యం విభాగాలతో ప్రారంభమైంది. తర్వాత స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో కొంతకాలం కొనసాగి, ప్రస్తుతం 1980 నుంచి కల్చరల్ ఎఫైర్స్ డిపార్ట్‌మెంట్‌లో కొనసాగుతుంది.

కళాశాలలో అందిస్తున్న కోర్సులు

కళాశాలలో ఏడు విభాగాల్లో కోర్సులందిస్తున్నారు. గాత్ర, వైలన్, వీణా, మృదంగం, డోలు, నాదస్వరం, భరతనాట్యంలలో కోర్సులను విద్యార్థులకు వివరిస్తున్నారు. వీటితో పాటూ తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రెగ్యులర్ కోర్సులు, సర్టిఫికెట్ డిప్లమో కోర్సులను నిర్వహిస్తున్నారు. బీఏ, మ్యూజిక్, నాలుగేళ్లు, ఎమ్ఏ మ్యూజిక్, పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులూ ఉన్నారు. సాయంత్రం వేళల్లో ఏడాది కాల వ్యవధిలో లలిత సంగీతం, హరికథ, డోలు విభాగాల్లో కోర్సులు ఉన్నాయి. ఈ ఏడాది నుంచి మరికొన్ని కోర్సులు ప్రవేశపెట్టేందుకు భాషా సాంస్కృతిక శాఖ రంగం సిద్ధం చేస్తోంది.

ప్రశాంత ఎన్నికలకు

సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా, కలెక్టర్ నిషాంత్‌కుమార్

- పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా

పార్వతీపురం: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీలు సహకరించాలని అరకు పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ మెహర్దా కోరారు. ఎన్నికల తుది పోటీ జాబితాలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులు, రాజకీయ పార్టీల అభ్యర్థులతో సోమవారం ఆయన కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ప్రదేశాలలో ఎన్నికల ప్రచార రాతలు ఉండరాదని, ప్రచారంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా పాటించాలని సూచించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రచారంలో ఆయా అభ్యర్థులు వారి ప్రచారానికి మాత్రమే కట్టుబడి ఉండాలన్నారు. ప్రచారానికి ముందస్తు అనుమతి ఉండాలని స్పష్టం చేశారు. ఒకే తేదీ, ఒకే సమయంలో అనుమతులు ఇవ్వబోమని చెప్పారు. ఎక్కడా నియమాల ఉల్లంఘన ఉండరాదని, ఒకరిపై ఒకరు దూషణలు, హింస చెలరేగే విధంగా ప్రచారం ఉండరాదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో పాడేరు, అరకు, రంపచోడవరంలలో అనుమతులు పొందేందుకు అవకాశం కల్పించామని చెప్పారు.

ఏఎస్ఆర్ జిల్లాలో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిస్థితుల దృష్ట్యా పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు వరకు మాత్రమే జరుగుతుందని అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్ కుమార్ తెలిపారు. ఆ జిల్లాలో ఎన్నికల ప్రచారం మే 11వ తేదీ సాయంత్రం 4 గంటలతో ముగుస్తుందని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ, కురుపాం, సాలూరు నియోజక వర్గాల పరిధిలో పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, పార్వతీపురం నియోజక వర్గంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటలు వరకు జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి కేశవ నాయుడు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారం


గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

రాజాం: గిరిజన సమస్యల పరిష్కారంలో ఎస్టీ కమిషన్ చురుగ్గా పనిచేస్తోందని కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. రాజాం పట్టణం కంచరవీధిలో పారిశ్రామికవేత్త పొట్టా సత్యనారాయణగుప్త ఇంటి వద్ద ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. పలు ప్రాచీన గ్రంథాలు, పుస్తకాలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2021 నుంచి ఎస్టీ కమిషన్‌కు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్టు వెల్లడించారు. అటవీ హక్కుల చట్టం పక్కాగా అమలవుతోందన్నారు. గిరిజన అక్షరాస్యత పెంపునకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయన్నారు.

గుడివాడలో సాలూరు యువకుడి మృతి

సాలూరు రూరల్: కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాలూరు మండలంలోని కొట్టుపరువు గ్రామానికి చెందిన చింతాడ అజయ్(30) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గుడివాడ పట్టణంలో ఓ చేపలచెరువులో పనిచేస్తున్న అజయ్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి తల్లి బుచ్చమ్మ, తండ్రి ప్రకాశ్, చెల్లి ఉన్నారు.

రేపటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

పార్వతీపురంటౌన్: 2024 ఫిబ్రవరిలో జరిగిన జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల్లో ఫెయిల్ అయిన, హాజరు కాని విద్యార్థులకు మే 1 బుధవారం నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు జిల్లా వృత్తివిద్యాశాఖాధికారిణి జి. మంజులావీణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కోర్సులకు సంబంధించి బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌ను పార్వతీపురంలోని వాసవి జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు సంబంధించి ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, ఎల్ఎంఅండ్‌డీ గ్రూపులకు వేదశ్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో, ఓఏఎస్, ఈటీ గ్రూపులకు సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఎంఅండ్ఏటీ, ఫిషరీష్, సీఈటీ గ్రూపులకు చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, సీపీఅండ్ఎం గ్రూపునకు కురుపాం కేటీఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో, సీఎస్ఈ గ్రూపునకు పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) కేంద్రంలో ప్రాక్టికల్స్‌కు కేటాయించామన్నారు. ఆయా కళాశాలలకు విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

చంద్రబాబు గ్యాంగ్‌ను నమ్మితే రాష్ట్రం అధోగతి

- 2014లో బాబు ఫేక్ హామీలను నమ్మి ప్రజలు ఓటేస్తే నట్టేట ముంచారు
- అబద్ధాలు, గిమ్మిక్కులతో మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారు
- దిగ్విజయంగా అమలవుతున్న వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోతోనే అభివృద్ధి
- ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర


పీడిక రాజన్నదొర

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అధికారం కోసం అర్రులు చాస్తూ నిస్సిగ్గుగా అబద్ధాలు చెప్పడం చంద్రబాబు సహా టీడీపీ గ్యాంగ్ జన్మహక్కులా ఉందని, వారిని మళ్లీ నమ్మితే రాష్ట్రం గతి అధోగతి పాలవుతుందని ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరులో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో విశాఖ సదస్సు ద్వారా 13.11 లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. తద్వారా 3.47 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. అంతకుముందు చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఎంత సంపద సృష్టించారో చెప్పమనండి. ఆయన పరిపాలనలోనే రాష్ట్రం కరువులో ఉంద'ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం భూసంస్కరణల్లో భాగంగా శాశ్వత భూమి హక్కు కల్పించేందుకు సర్వే చేయాలని సూచించిందని, కానీ దాన్ని టీడీపీ వ్యతిరేకిస్తోందని ప్రస్తావించారు. రైతులే తమ భూసమస్యల శాశ్వత పరిష్కారానికి, పటిష్టమైన భూరికార్డుల కోసం భూసర్వే జరగాలని కోరుకుంటున్నారన్నారు. వ్యవసాయ రంగానికి చంద్రబాబు రూ.34,185 కోట్లు మాత్రమే కేటాయిస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.55,215 కోట్లు కేటాయించిన విషయాన్ని మరచిపోకూడదన్నారు. గ్రామీణాభివృద్ధికి చంద్రబాబు కేవలం రూ.46,895 కోట్లు మాత్రమే కేటాయిస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.92,655 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. ఇలా ఏ రంగం చూసినా చంద్రబాబు కన్నా జగన్‌మోహన్‌రెడ్డే నంబరు ఒన్‌గా ఉన్నారన్నారు. గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో చెప్పిన ఫేక్ హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నట్టేటముంచారని విమర్శించారు. అందుకే 2019 ఎన్నికల్లో చారిత్రాత్మకమైన తీర్పుతో చంద్రబాబును హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు పరిమితం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ 2024 ఎన్నికల్లో ఓట్ల కోసం ఫేక్ పథకాలను సూపర్ సిక్స్ అంటూ అబద్దాలు, గిమ్మిక్కులతో చంద్రబాబు గ్యాంగ్ వస్తున్నారని ఎద్దేవా చేశారు. వాటి అమలుకే సుమారు రూ.75వేల కోట్లు ఖర్చు ఉంటుందని, ఆచరణయోగ్యం కాకున్నా అధికార యావతో అన్నీ అమలుచేసేస్తామని చెబుతున్నారని విమర్శించారు. తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలన్నీ అమలుచేసిందనీ, ఇకపై కూడా ఆయా పథకాల ద్వారా కలిగే ప్రయోజనాన్ని మరింత పెంచుతూ కొనసాగిస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2024 మేనిఫెస్టో విడుదల చేశారని చెప్పారు. దిగ్విజయంగా అమలవుతున్న ఈ మేనిఫెస్టోతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకు కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధి పనులే నిదర్శనమని రాజన్నదొర చెప్పారు.

13న పోలింగ్ రోజు సెలవు దినంగా ప్రకటన

విజయనగరం అర్బన్: పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికలకు పోలింగ్ జరిగే మే 13వ తేదీ సోమవారం నాడు జిల్లాలో స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. ఆ రోజు ప్రైవేటు సంస్థల్లో పనిచేసే కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకోనేందుకు వీలుగా నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం, 1881 ప్రకారం ఆ రోజు సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో సెలవు దినంగా ప్రకటించేందుకు జిల్లా కలెక్టర్‌లకు అధికారాలు దఖలు పరుస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

విజయనగరం అర్బన్: పట్టణంలోని పూల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 1 నుండి 8వ తరగతి వరకు 2024 – 25 సంవత్సరంలో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జె.దయానంద తెలిపారు. ప్రవేశం కోరే బాలబాలికలు వినికిడి లోపం ఉన్నట్లు సదరం సర్టిఫికెటు, జనన, కుల ధ్రువపత్రం, పాఠశాల బదిలీ సర్టిఫికెట్‌లతో పాటు రైస్ కార్డు లేదా రేషన్ కార్డు, ఆధార్, బ్యాంకు అకౌంట్ పాస్ పుస్తకం మొదటి పేజీ జిరాక్స్ ప్రతితో పాఠశాలలో సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన మూగ చెవిటి బాల, బాలికలు ఈ పాఠశాలలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో 1వ తరగతిలో చేరేందుకు 6 నుంచి 8వ సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. టీ.సీ.ఆధారంగా అన్ని తరగతుల్లో ప్రవేశం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు 90000 13640, 94404 37629 మొబైల్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గరుగుబిల్లి: రాష్ట్ర పౌరగ్రంథాలయశాఖ సంచాలకుడు ప్రసన్నకుమార్ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బొనెల లక్ష్మి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జూన్ 11 వరకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఈ వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకుడు ఎన్. మధుసూదనరావు తెలిపారు. విద్యార్థులు కథలు వినడం, పుస్తకపఠనం, పుస్తక సమీక్ష, ఆటల పోటీలు తదితర కార్యక్రమాలను ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకులది కీలక పాత్ర

- ఓటర్లలో విశ్వాసాన్ని కలిగించాలి
- జిల్లా పరిశీలకులు హనీష్ దాబ్రా, తలాత్ పర్వేత్
- పోలింగ్ సిబ్బందితో పాటే మైక్రో అబ్జర్వర్లు వెళ్లాలి
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ దాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్లీ, కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పారదర్శకంగా ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ దాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్లీ కోరారు. ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులది కీలక పాత్ర అని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ పట్ల ఓటర్లలో, ప్రజల్లో నమ్మకాన్ని కల్పించాల్సిన బాధ్యత వీరిపై ఉందన్నారు. మైక్రో అబ్జర్వర్లకు కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం మొదటి విడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకుల విధులు, నిబంధనలను వివరించారు. జిల్లాలోని సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలకులను నియమించడం జరుగుతుందని చెప్పారు. నిబంధనలకు అనుగుణంగా ఎన్నిక ప్రక్రియ జరిగిందా లేదా అన్న విషయాన్ని వీరు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ అదనంగా వెబ్ కాస్టింగ్‌తో పాటు, వీడియో రికార్డింగ్ కూడా జరుగుతుందని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల రోజు తాము పరిశీలించిన విషయాన్ని రిపోర్టు ఆధారంగా అబ్జర్వర్లు రీపోలింగ్‌కు కూడా ఆదేశాలను జారీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఎన్నిక మరునాడు జిల్లా పరిశీలకులు నిర్వహించే స్క్రూటినీలో సూక్ష్మ పరిశీలకుల రిపోర్టుల ఆధారంగానే నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. వీరు కూడా పోలింగ్ సిబ్బందితో పాటు ముందు రోజు రాత్రే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. ఉదయం 5.30కు జరిగే మాక్ పోల్ నుంచి, ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ వీరు అక్కడే తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. అనంతరం సిబ్బందితో పాటు రిసెప్షన్ సెంటర్‌కు చేరుకొని అనెగ్జర్ 28 ద్వారా తమ నివేదికను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ, పీఓలు, సెక్టార్ అధికారుల విధుల పట్ల కూడా మైక్రో అబ్జర్వర్లకు పవర్‌పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల పరిశీలకులు దాబ్రా, తలాత్ పర్వేజ్ మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకుల విధులు, ప్రాధాన్యతను వివరించారు. ఏదైనా సందేహం తలెత్తితే తమకు సంప్రదించవచ్చునని సూచించారు. పోలింగ్ సిబ్బందితో పాటే వీరు కూడా ముందురోజే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని, 6 గంటల తరువాత సూక్ష్మ పరిశీలకులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. 6 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్నవారికి చివరి నుంచి సీరియల్ నెంబర్లు కేటాయించి అందరికీ ఓటు వేసే అవకాశం కల్పించాలని సూచించారు. పోలింగ్ ముగిసాక తమ రిపోర్టును సీల్డు కవరులో సమర్పించాలని చెప్పారు. మాక్ పోల్ తప్పనిసరి అని దీని వల్ల ఓటర్లలో, ఏజెంట్లలో ఓటింగ్ ప్రక్రియ పట్ల నమ్మకం, విశ్వాసం ఏర్పడతాయని అన్నారు. ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఓటు వేసే దృశ్యాన్ని వీడియో రికార్డింగ్, వెబ్ కాస్టింగ్ చేయకూడదని, ఓటర్లు తాము ఎవరికీ ఓటు వేశారో, ఆ రహస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనీ ఉందన్నారు. శిక్షణా కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంట త్రివినాగ్, పార్లమెంటు ఏఆర్ఓ సుమబాల, ట్రైనింగ్స్ నోడల్ అధికారి సుధాకరరావు పాల్గొన్నారు.

ఓపీఓలు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయాలి

విజయనగరం అర్బన్: జిల్లాలో జరగనున్న సాధారణ ఎన్నికల విధుల్లో భాగంగా కొత్తగా పోలింగ్ సిబ్బంది (ఓపీఓ)లుగా నియమితులైన వారు మే 1వ తేదీలోగా తమ ప్రాంత తహసీల్దార్లకు పోస్టల్ బ్యాలెట్ కోసం తమ దరఖాస్తులను అందజేయవలసి ఉంటుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోని ఓపీఓలు ఫారం 12 లో దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

విజయనగరం టౌన్: పుస్తక పఠనాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సహజ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌కే బాబు తెలిపారు. మహాకవి గురజాడ అప్పారావు స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి పలువురు సాహితీవేత్తలు హాజరై పుస్తకాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మంచి సాహిత్య విలువలు కలిగిన పుస్తకాలను నేటితరం వారు తీసుకువెళ్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త నాలుగెస్సుల రాజు, గురజాడ ముని మనవడు వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.